


# కుసుమకుమారి

తెలుగు అనువాదం: పి. హైమవతి




కుసుమ కుమారి చాలా మంచి పిల్ల. కుసుమ మంచి పిల్ల అవడం గొప్ప విషయం కాదు... ఆమె మంచిగా ఉండటం తప్ప వేరేదారి లేదు. కుసుమ వయసు పద్దెనిమిదే అయినా ఇరవై ఎనిమిదేళ్ళ ఆడదానిలా ఉంటుంది. నలభైల్లో పడిన మధ్య వయసు ఆడవాళ్లా ప్రవర్తిస్తుంది. ఆమె లావుగా, పొట్టిగా ఉంటుంది. నల్లటి కోల మొహం మీద మరీ తెల్లని స్ఫోటకం మచ్చలు స్పష్టంగా కనిపిస్తుంటాయి. తప్పడ ముక్కు మీద నిలబడి ఉన్న లావుపాటి కళ్ళద్దాలు ఆమె కళ్ళను భూతద్దంలో చూపిస్తాయి. ఆమె నెత్తి మీద జుట్టు పొట్టిగా, పల్చగా ఉంటుంది. ఆకాసిన్ని వెంట్రుకలు తలకి అంటుకుపోయేట్టుగా ఆమె నూనె రాస్తుంది. జుట్టుని బిగదీసి జడవేయడం వల్ల నుదురు కనుబొమ్మలు ముందుకి పొడుచుకు వచ్చినట్టుగా ఉంటాయి. ఆమె శరీరం పైనుంచి కిందకి ఒకేలా ముద్దలా వుంటుంది. ఆమె వక్షం, నడుము, సీటు కొలతలు ఎంతుంటాయో ఎవరూ చెప్పలేరు. అవన్నీ ఒక తెల్లటి చీరచే చుట్టబడి ఒకే ఆకారంలో కనిపిస్తాయి.

కాని ఈ లోపాలన్నింటినీ తెలివిగా, మంచిగా ఉండటం వల్ల కుసుమ కప్పిపుచ్చుకుంది. ఆమె కష్టపడి చదివి, అన్నిటా ఫస్ట్ క్లాసులో పాసవుతుంది. ఆమె గంటల తరబడి పుస్తకాలలోనే కాలక్షేపం చేస్తుందన్న విషయం ఆమె కళ్ళద్దాలు, ఆమె రూపం చూస్తే ఇట్టే తెలుస్తుంది. ఆమె వల్ల తల్లిదండ్రులకు ఒక్క సమస్యా లేదు. ఆమె ఉదయమే లేచి సైకిల్ మీద కాలేజీకి వెడుతుంది. కాలేజీ నుంచి తిరిగి వస్తుంది. ఆమెకు వేరే పనులేవీ లేవు. ఆమె మనసు మరో వైపు చలించదు. ఆమెను చూసి ఎవరూ చలించరు.

కుసుమకి కొత్త ఫాషన్ల మీద సరదా లేదు. అబ్బాయిల మీద అసలు సరదా లేదు. సెక్సు మీద సరదా లేదు. ఆమె మేకప్ చేసుకోదు. అలంకరణ వస్తువుల మీద మోజు లేదు. ఎలావున్నా మనుషులు భగవంతుడిచ్చిన ఆకారం, రంగులతో తృప్తి పడాలన్నది ఆమె నమ్మకం. మనుషులు దయార్ద్ర హృదయులై, శీలవంతులై ఉండాలని ఆమె ఉద్దేశం. కష్టపడటమంటే ఆమెకు ఇష్టం. స్త్రీ యొక్క స్థానం వంటింట్లోనే అని ఆమె నమ్మకం. తలనిండా కొంగు కప్పుకోకుండా ఆడాళ్ళు బైట తిరగరాదని ఆమె ఉద్దేశ్యం... కుసుమ స్నేహితులంతా ముసలివాళ్ళు. యువకులెవరూ ఆమెను పట్టించుకోరు. విధి క్రూరంగా ఆమె మీద కురిపించిన వాస్తవికతను ఆమె అర్థం చేసుకుంది.

కుసుమ పంథొమ్మిదవ పుట్టిన రోజుకి

కొంతమంది కాలేజీ అమ్మాయిలు ఆమెకు లిప్‌స్టిక్, మొహానికి రాసుకునే ఎర్రటి పౌడరు పంపారు. కుసుమ వాళ్ళు తనని అవమానించడానికే అలా చేసినట్టుగా భావించింది. ఆమె వాటిని డ్రాయిర్‌లో ఓ మూల పడేసి, కిటికీలోంచి బైటికి విసిరేసినట్టుగా తలిపింది. ఆమె తనగదిలో అద్దాన్ని గోడవైపుకితిప్పేసి ఇంకప్పుడూ జీవితంలో అద్దంలోకి చూసుకోకూడదని నిర్ణయించుకుంది.

కుసుమచాలా తక్కువగా నవ్వుతుంది. పంధొమ్మిదవ పుట్టినరోజు తర్వాత పూర్తిగా నవ్వడం మానేసింది. ఆమె ముభావంగాఉండటం అలవాటుచేసుకుంది. తనమీద తనకి శ్రద్ధ తగ్గిపోయింది. అందువల్ల మరింతఅందవికారంగా తయారవుతానని ఆమెకు తెలుసు. ఏ మగాడు తనకేసి చూడడు కాబట్టి, ఏ మగాడు తనను పట్టించుకోడు కాబట్టి- అందంగా ఆకర్షణీయంగా కనబడాలనుకోవడంలో అర్థంలేదు అన్నది ఆమె వుద్దేశ్యం. ఆమె ఆకర్షణీయంగా కనబడదు కాబట్టి ఏ మగాడు ఆమెకేసి చూడడు- ఆమెని పట్టించుకోడు.

ఆమెకు ఏప్రిల్‌లో డిగ్రీపరీక్షలు పూర్తయ్యాయి. కాలేజీ జీవితం పూర్తయ్యింది. మిగతా ఆడపిల్లలంతా పరీక్షనుంచి బైటకి రాగానే స్నేహితులతోటి, చుట్టాలతోటి నవ్వుతూ, తుళ్ళుతూ మాట్లాడుతున్నారు. కుసుమ కోసం ఎవ్వరూ రాలేదు. పరీక్షనుంచి బైటకురాగానే ఆమె మామూలుగా చాలా మామూలుగా తనసైకిల్ తీసుకుంది. మిగిలిన ఆడపిల్లలంతా పెళ్ళికోసం ఎదురుచూస్తుంటారు, కాని కుసుమ ఎదుర్చూడడానికి ఏమీలేదు- ఏవస్తువులూ లేని తనగది, గోడవైపుకి తిప్పబడిన అద్దం... తన పుస్తకాలు... అంతే!

కుసుమ నిర్లిప్తంగా సైకిల్ తొక్కుకుంటూ ఇంటికి బయల్దేరింది. రోడ్ మీద తనొక్కతే ఉంది- మనసునిండా శూన్యం తప్ప ఏమీలేదు. ఇంటివైపు సైకిల్ తిప్పేటప్పుడు పరధ్యానంగా ఎటో తిప్పింది. ఏంజరిగిందో తెల్సుకునేలోగా ఆమె సైకిల్ వెళ్ళి నారింజ పళ్ళు అమ్ముకునే యువకుడ్ని ఢీకొంది. ఆమె అతని మీదపడి, దొర్లుకుంటూ వెళ్ళి రోడ్ మీద పడింది. ఆమె సైకిల్ పేవ్‌మెంటు మీద పడింది. ఆమె కళ్ళద్దాలు పగిలి ముక్కలయి పోయాయి. నారింజపళ్ళ కుర్రాడు కాస్త షాక్‌తిన్నాడు. కాని అతనికి దెబ్బలేవీ తగల్లేదు. నారింజపళ్ళబుట్ట దబ్బున పడింది కానీ పళ్ళుపడలేదు. అతను ఆనందంగా నవ్వాడు.

"దొరసానీ! కాస్త చూసుకుని సైకిల్ తొక్కాలి!"

కుసుమ కోపంగా ఉంది అతనిమాటలు మరింత కోపం తెచ్చాయి.

"కళ్ళులేవా? ఎటుపోతున్నావో చూసుకోలేవా?" ఆమె కోపంగా అంది.

పళ్ళ కుర్రాడు అటు ఇటు చూశాడు. రోడ్డంతా నిర్మానుష్యంగా ఉంది. వాడు కొంటెగా నవ్వాడు.

"కాదు దొరసానీ-నేను గుడ్డాణ్ని కాదు- కాని నాకు ఒకటే కన్ను ఉంది" అని- ఓ కన్నుమూసి తెరిచి-కన్నుగొట్టి పెదాలతో ముద్దుపెట్టుకుంటున్న చప్పుడు చేసాడు.




కుసుమ మొహం కోపంతోజేవురించింది. ఆమె బుసలు కొడుతోంది. ఆమె సైకిల్ హడావుడిగా తీసుకుని కంగారుగా ఎక్కింది – ఉడుకుమోత్తనం నిండిన కంఠంతో "పంది వెధవా...గాడిదా!" అని తిట్టింది.

పళ్ళ కుర్రాడికి కోపం రాలేదు సరికదా- ఆనందిస్తున్నాడు.

"గాడిదా? ఎప్పుడేనా గాడిదను చూశావా?" బిగ్గరగా నవ్వుతూ, కన్నుకొడుతూ అన్నాడు వాడు.

కుసుమ ఆ వీధి చివరికి వెళ్ళేదాకా వాడు నవ్వుతూ, కన్నుగొడుతూనే ఉన్నాడు. ఆమె హడావుడిగా ఇంటి కెళ్ళిపోయి, తన గదిలోకి వెళ్ళిపోయి-తలగడలో తల దూర్చేసుకుంది.

అలా కొన్నిగంటల తరబడి తన తలను, ఆలోచనలను తలగడ కింద సమాధి చేసింది కుసుమ. ఆమెకు మళ్ళీ మళ్ళీ పళ్ళ కుర్రాడి నవ్వు, వాడి చేష్టలు జ్ఞాపకాని కొచ్చాయి. ఇంతకుముందెప్పుడూ ఎవ్వరూ తనతో అలా ప్రవర్తించలేదు. సూర్యాస్తమయం అయ్యింది. చంద్రుడి లేత కిరణాలు కిటికీలోంచి ఆమె పక్కమీద పడుతున్నాయి. ఆమెకు పళ్ళ కుర్రాడు జ్ఞాపకం వచ్చాడు. వాడిమీద కోపం, పగ, ద్వేషం తగ్గాయి.

ఆమె లేచి డ్రాయర్ తెరిచి అందులో దాచిన లిప్‌స్టిక్, మొహానికి రాసుకునే ఎర్రపౌడరూ తీసింది. చెక్కిళ్ళకి ఎర్ర పౌడరు రాసుకుంది. అద్దం తనవైపు తిప్పుకుంది. పెదాలను ముందుకు జాపి లిప్‌స్టిక్ పూసుకుంది. జడవిప్పి, తల గట్టిగా విదిలించింది. జుట్టు భుజాలమీద పడింది. ఓ చిన్నగులాబీ పువ్వు కోసి తలలో అమర్చుకుంది. కొంచెం వెనక్కి వెళ్ళి-అటు ఇటు తిరుగుతూ అద్దంలోకి చూసుకుంది.

* * *